నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | మంగళవారం 24 డిసెంబర్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

బీఆర్ఎస్ మండలాధ్యక్షుడిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు

హాజీపూర్, డిసెంబర్ 23 : బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మొగిళి శ్రీనివాస్ తండ్రి మల్లయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. సోమవారం సాయంత్రం వేంపల్లి గ్రామంలోని శ్రీనివాస్ ఇంటికి మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు వెళ్లి పరామర్శించారు. మంచిర్యాల మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సాగి వెంకటేశ్వర్లు, మాజీ పీఏసీఎస్ చైర్మన్ సందెల వెంకటేశ్, మాజీ వైస్ ఎంపీపీ మందపెల్లి శ్రీనివాస్, నాయకులు మొగిలి సత్యం, విజిత్ రావు తదితరులున్నారు.

సమస్యలు సత్వరమే పరిష్కరించేలా కృషి

ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్, డిసెంబర్ 23 : ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను సంబంధిత అధికారుల సమన్వయంతో సత్వరమే పరిష్కరించేలా కృషి చేస్తామని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో మంచిర్యాల, బెల్లంపల్లి ఆర్డీవోలు శ్రీనివాసరావు, హరికృష్ణలతో కలిసి అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. జైపూర్, మంచిర్యాల, దండేపల్లి, తాండూర్, బెల్లంపల్లి, భీమిని, తదితర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు దరఖాస్తులను అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరిస్తామన్నారు.

జాతీయ స్థాయిపోటీలకు ఎంపికైన క్రీడాకారులు

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

నస్పూర్, డిసెంబర్ 23 : జూనియర్ బాలికల జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి ముగ్గురు క్రీడాకారులు ఎంపికయ్యారని ఉమ్మడి జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు గోనె శ్యాంసుందర్‌రావు, ప్రధాన కార్యదర్శి కనపర్తి రమేశ్ సోమవారం తెలిపారు. నవంబరు 29 నుంచి డిసెంబర్ 1 వరకు ఆర్మూర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్ బాలికల హ్యాండ్ బాల్ పోటీల్లో శివాత్మిక, హాసిని, సింధూజ ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. వీరిని ఉమ్మడి జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి రఘునాథ్‌రెడ్డి, కార్యదర్శి రమేశ్‌రెడ్డి, సెవెన్ హిల్స్ స్కూల్‌ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి, చరణ్, కోచ్‌లు అరవింద్, కల్యాణ్, శేఖర్, రాకేశ్, సాయి, పీఈటీ మమత, తదితరులు అభినందించారు.

సారూ.. ఇదేమి తీరు..
కలెక్టర్‌కు ఫిర్యాదు ఇవ్వడానికి వచ్చిన వృద్ధురాలిని పక్కకు నెట్టుకెళ్తున్న సెక్యూరిటీ సిబ్బంది

ఏదో భూ సమస్య ఉందని ఓ వృద్ధురాలు కొన్ని రోజులుగా మంచిర్యాల కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణికి వస్తున్నది. అధికారులు ఆమెకు వివరణ ఇచ్చి పంపినా.. అర్థం కాకనో.. లేక సమస్య తీరకనో నిత్యం ఫిర్యాదు చేసేందుకు వస్తూ ఉంటుంది. ఈ క్రమంలో సోమవారం కూడా వచ్చింది. కలెక్టర్‌ను కలిసేందుకు వెళ్లగా, అక్కడే ఉన్న సెక్యూరిటీ సిబ్బంది వృద్ధురాలు అని కూడా చూడకుండా పక్కకు నెట్టుకెళ్లారు. ఆమెను తీసుకురావాల్సిన మహిళా కానిస్టేబుళ్లు అక్కడే ఉన్నా చోద్యం చూస్తూ ఉండిపోయారు. ఈ ఘటనపై అక్కడున్న వారు విమర్శలు గుప్పించారు. సమస్య చెప్పకోడానికి వచ్చే వారిపట్ల వ్యవహరించే తీరు ఇలాగేనా అంటూ అసహనం వ్యక్తం చేశారు. - మంచిర్యాల, స్టాఫ్ ఫొటోగ్రాఫర్

వృద్ధురాలిని సెక్యూరిటీ నెట్టుకెళ్తుంటే కూర్చుండి చూస్తున్న మహిళా కానిస్టేబుళ్లు

సీఆర్టీల సమ్మె నేపథ్యంలో తాళం వేసి ఉన్న నిర్మల్ జిల్లా కడెం గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాల

సమ్మెలో సీఆర్టీలు.. బడులకు తాళం

డిమాండ్లు నెరవేర్చాలంటూ సమ్మె బాట పట్టిన కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్స్

- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మూతపడిన 654 ఏకోపాధ్యాయ పాఠశాలలు
- సమీపిస్తున్న పదో తరగతి పరీక్షలు..కొనసాగని తరగతులు
- ఫలితాలపై ప్రభావం చూపే అవకాశం
- విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకం
- వారం అవుతున్నా స్పందించని సర్కారు

మంచిర్యాల, డిసెంబర్ 23 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : గిరిబిడ్డలకు విద్య అందని ద్రాక్షగా మారింది. ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్స్(సీఆర్‌టీలు) 8 రోజులుగా సమ్మె చేస్తుండగా, చదువులు సాగక విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతున్నది. పరీక్షలు సమీపిస్తున్న వేళ తరగతుల నిర్వహణకు బ్రేక్ పడడంతో పాస్ అవుతామో.. లేదోనన్న బెంగ పట్టుకున్నది.

ఉమ్మడి జిల్లాలోని 654 పాఠశాలల్లో..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 654 ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో దాదాపు 48 వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. సమస్యల పరిష్కారం కోసం సీఆర్టీలు సమ్మెకు దిగడంతో తరగతులు కొనసాగడం లేదు. ఈ పాఠశాలలన్నీ తాళం వేసి ఉంటుండగా, స్కూల్‌కు వచ్చిన గిరిజన విద్యార్థులు ఉపాధ్యాయల కోసం ఎదురుచూసి వెనుదిరిగిపోతున్నారు. కొన్ని స్కూళ్లలో పిల్లలు కాసేపు ఆడుకొని ఇంటికి వెళ్లిపోతున్నారు.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మూతబడ్డ ఏకోపాధ్యాయ పాఠశాలల వివరాలు

జిల్లా	ఏకోపాధ్యాయ పాఠశాలలు
ఆసిఫాబాద్	284
నిర్మల్	180
ఆదిలాబాద్	165
మంచిర్యాల	25
మొత్తం	654

పిల్లల భవిష్యత్తు ప్రశ్నార్థకం..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలల్లోని ఉపాధ్యాయులు సమ్మెబాట పట్టగా, ప్రస్తుతం ఒక్కో పాఠశాలలో ఒకరిద్దరు ఉపాధ్యాయులే పాఠాలు బోధిస్తున్నారు. అన్ని సబ్జెక్టులు బోధించే సిబ్బంది విధులకు హాజరుకాక ఉన్న రెగ్యులర్ ఉపాధ్యాయులు నానా తంటాలు పడాల్సి వస్తున్నది. పిల్లలందరినీ ఒకేదగ్గర చేర్చి చదివించడం తప్ప ఏం చేయలేకపోతున్నారు. మా సబ్జెక్ట్ అంటే చెబుతాం కానీ.. అన్ని సబ్జెక్టులు బోధించడమెలాగని పేర్కొంటున్నారు. పదో తరగతి పరీక్షల్లో ఆశ్రమ పాఠశాలలు కొన్నేళ్లుగా మంచి ఫలితాలు సాధిస్తున్నాయి. ఇక్కడ చదివిన విద్యార్థులకు మంచి గ్రేడ్‌లు వస్తున్నాయి. ఉత్తీర్ణత శాతంలోనూ ప్రైవేట్ స్కూళ్లకు ధీటుగా గిరిజన పాఠశాలలు సత్తా చాటుతున్నాయి. ఇప్పుడు పదో తరగతితో పాటు మిగతా పరీక్షలు దగ్గర పడుతున్నాయి. ఉత్తీర్ణత శాతం పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సీఆర్టీల సమ్మెతో గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ఆయా పాఠశాలలు దాదాపు 70 శాతం నుంచి 80 శాతం సీఆర్టీలపైనే ఆధారపడి నడుస్తున్నాయి. రెగ్యులర్ ఉపాధ్యాయులు 20 శాతం కూడా లేరు. ఈ నేపథ్యంలో సీఆర్టీల సమ్మెతో పిల్లల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. చదవలేని పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన సమయంలో టీచర్లు సమ్మెలో ఉండడం ఫలితాలపై ప్రభావం చూపనున్నది. అలాగే ఆసిఫాబాద్ జిల్లాలో 46 గిరిజన ఉన్నత పాఠశాలలుండగా, 13 పాఠశాలల్లో ఒకరిద్దరు రెగ్యులర్ ఉపాధ్యాయులే విధుల్లో ఉన్నారు. మిగిలిన వారంతా సమ్మెలో ఉన్నారు. నిర్మల్ జిల్లాలో 11 పాఠశాలలు, మంచిర్యాలలో 16 పాఠశాలలు, ఆదిలాబాద్‌లోని కొన్ని స్కూళ్లలోనూ ఇదే దుస్థితి నెలకొంది. ఈ పరిస్థితుల్లో పదో తరగతి విద్యార్థులతో పాటు మిగిలిన విద్యార్థులపైనా తీవ్రమైన ప్రభావం పడుతున్నది.

ఉపాధ్యాయులు రాకపోవడంతో కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా లింగాపూర్ మండలం పిట్టగూడ పాఠశాల ఎదుట ఆడుకుంటున్న విద్యార్థులు

సమ్మెకు ఎనిమిది రోజులు.. స్పందించని సర్కారు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు సంబంధించి ఉట్నూర్ ఐటీడీఏ పరిధిలో పని చేసే సీఆర్టీలు సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 16వ తేదీ నుంచి ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయం ముందు సమ్మె చేస్తున్నారు. దాదాపు ఎనిమిది రోజులుగా టీచర్లు సమ్మెలో ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు, ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదు. అధికారంలోకి రాకముందు మా సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ నాయకులు ఏ ఒక్కరూ ఇప్పుడు పట్టించుకోవడం లేదని సీఆర్టీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో 12 మంది గిరిజన ఎమ్మెల్యేలుంటే ఏ ఒక్కరూ అసెంబ్లీలో మా సమ్మె గురించి ప్రస్తావించడం లేదని వాపోతున్నారు. బీఆర్ఎస్ నుంచి మాజీ మంత్రి హరీశ్‌రావు మా సమస్యను ప్రస్తావించారని.. దానిపై ప్రభుత్వ పెద్దలు అసలు స్పందించకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని లేనిపక్షంలో ప్రత్యేక కార్యాచరణ ప్రకటించి సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరిస్తున్నారు.

సీఆర్టీల ముఖ్యమైన డిమాండ్‌లు

- గిరిజన ఆశ్రమ పాఠశాలలు, ప్రాథమిక పాఠశాలల్లో పని చేస్తున్న సీఆర్టీలకు మినిమం టైమ్ స్కేల్, ఉద్యోగ భద్రత కల్పించాలి. ● సీఆర్టీల సర్వీసులను క్రమబద్ధీకరించాలి.
- ప్రతి నెలా ఒకటో తేదీనే వేతనాలు చెల్లించాలి.
- మహిళా సీఆర్టీలకు వేతనంతో కూడిన 180 రోజుల ప్రసూతి సెలవులు ఇవ్వాలి.
- ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోయిన సీఆర్టీలకు రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి.
- పీఎఫ్ సౌకర్యం కల్పించడంతో పాటు 61 ఏళ్లు నిండిన వారికి రూ.20 లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందించాలి. ● సీఆర్టీలందరికీ హెల్త్‌కార్డు సౌకర్యం కల్పించాలి.
- ఇతర శాఖల్లోని స్కూల్ అసిస్టెంట్లు, ఎస్‌జీటీలకు, ఉపాధ్యాయులకు ఇస్తున్న వేతనమే గిరిజన సంక్షేమ శాఖలో పని చేస్తున్న సీఆర్టీలకూ ఇవ్వాలి.

ప్రభుత్వం దిగిరాకుంటే ఆమరణ దీక్ష

రాష్ట్రవ్యాప్తంగా రెండు వేల మంది సీఆర్టీలు ఈ నెల 16 నుంచి సమ్మెలో ఉన్నారు. 8 రోజులవుతున్నా అధికారులు స్పందించడం లేదు. అన్ని డిపార్ట్‌మెంట్‌లలో పని చేస్తున్న కాంట్రాక్ట్ టీచర్లను రెగ్యులరైజ్ చేశారు. మా డిపార్ట్‌మెంట్‌లో ఎందుకు చేయడం లేదని అడుగుతున్నాం. రాష్ట్రంలో రెండు వేల మంది ఉంటే.. ఒక్క ఆదిలాబాద్ జిల్లాలోనే 1200 మంది సీఆర్టీలు ఉన్నారు. మాకు న్యాయం చేయాలి. మా డిమాండ్‌లను పరిగణలోకి తీసుకొని పరిష్కారం చూపాలి. గవర్నమెంట్ చర్చలకు రాకపోతే ఆమరణ నిరాహార దీక్షకు సైతం పూనుకుంటాం.

- జాదవ్ వినంత్‌రావు, సీఆర్టీ, రాష్ట్ర వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు

ఝరి గ్రామంలో పోస్టర్లను ప్రదర్శించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎఫ్ఆర్వో మజారొద్దీన్

అడవుల సంరక్షణ అందరి బాధ్యత

కెరమెరి, డిసెంబర్ 23 : అడవులను సంరక్షించే బాధ్యత మనందరిపై ఉందని కెరమెరి ఎఫ్ఆర్వో సయ్యద్ మజారొద్దీన్ అన్నారు. సోమవారం ఝరి గ్రామంలో ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎఫ్ఆర్వో మాట్లాడుతూ ప్రకృతి పరిరక్షణ అడవులతోనే సాధ్యమని, వాటిని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. పులి సంచరిస్తుందనే బెడదతో అడవుల్లో నిప్పు పెట్టి వన్యప్రాణులకు హాని కలిగించవద్దని తెలిపారు. కొంత మంది పంటల రక్షణ పేరిట విద్యుత్ వైర్లు అమర్చడం, వన్యప్రాణులను వేటాడడం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పశువుల కాపారులు, చేలకు వెళ్లే రైతులు తీసుకోవాల్సిన జాగ్రతలపై పోస్టర్లు ప్రదర్శించి అవగాహన కల్పించారు. ఎఫ్ఎస్వో శ్రావంతి, ఎఫ్‌బీవోలు రామయ్య, నరసింహారెడ్డి, దేవిదాస్, మాజీ జడ్పీటీసీ లక్ష్మణ్‌రావ్, సిబ్బంది షేక్‌గౌస్, కౌలాస్ పాల్గొన్నారు.

ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలి

ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

ఆసిఫాబాద్ టౌన్,డిసెంబర్ 23 : ప్రజావాణికి వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించేలా అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆసిఫాబాద్ ఆర్డీవో లోకేశ్వర రావుతో కలిసి అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.

మాణిక్‌గూడ పరిసర ప్రాంతాల్లో చిరుత సంచారం

ఆసిఫాబాద్ టౌన్,డిసెంబర్ 23 : మండలంలోని మాణిక్‌గూడ పరిసర ప్రాంతాల్లో చిరుత పులి సంచరిస్తున్నట్లు ఆసిఫాబాద్ రేంజ్ అధికారి గోవింద్ చంద్ సర్దార్ తెలిపారు. సోమవారం అటవీశాఖ అధికారులు గ్రామ పరిసర ప్రాంతాల్లోని అడవిలో చిరుత పులి అడుగులను గుర్తించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సాయంత్రం వేళ అటవీ ప్రాంతాల్లోకి వెళ్లకూడదన్నారు. శబ్దాలు చేసుకుంటూ పత్తి ఏరాలని, చేలల్లో విద్యుత్ వైర్లు అమర్చవద్దని, అలా చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎక్కడైనా చిరుత పులి లేదా పులి కనిపిస్తే వెంటనే తమకు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారి యోగేశ్, బీట్ అధికారి రాజేశ్, యయానిమల్ ట్రాకర్స్ పాల్గొన్నారు.

వివేక్ సారూ.. ఇదిగో ఇసుక దందా!

- అక్రమ రవాణా చేయనీయమని చెబితిరి.. మరి ఇప్పుడేమంటారు
- అప్పుడు బాల్క సుమన్‌ను విమర్శించిన వివేక్.. మరి ఇప్పుడు ఆయన హస్తమే ఉన్నదా?
- వేలాల కేంద్రంగా 24 గంటల పాటు తవ్వకాలు
- ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన జైపూర్ నాయకులు

వేలాల-కిష్టాపూర్ క్వారీ నుంచి ఇసుక తరలిస్తున్న లారీ

మంచిర్యాల, డిసెంబర్ 23 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ''చెన్నూర్ నియోజకవర్గంలో ఎవ్వరు కూడా బియ్యం దందా.. భూ దందా.. ఇసుక దందాలు చేయవద్దు. ఈ విషయంలో పోలీసులకు, ప్రభుత్వ అధికారులకు పూర్తి స్వేచ్ఛ ఉంది.. నిజనిజాలు బయటపెట్టి చట్ట ప్రకారం చర్యలు తీసుకోండి. దందాలు చేసేటోళ్లు ఎంత పెద్దవారైనా విడిచిపెట్టేది లేదు. ఈ విషయంలో ఎవరినీ ఉపేక్షించవద్దు. ఇందారంలో ఇసుక తీసేటోళ్లు నా పేరు చెబుతున్నరంటున్నరు. నేను ఎవరికీ ఇసుక తీసుకెళ్లమని చెప్పలేదు. వే బిల్లులు ఉన్న లారీలు మాత్రమే రోడ్ల మీదకు రావాలి. జీరో లారీలు కనిపిస్తే వెంటనే కేసులు నమోదు చేయాలని పోలీసులను ఆదేశిస్తున్నా.'' అంటూ తెగ ప్రచారం చేసుకున్నారు చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్. ఆయన మాట్లాడిన వీడియోను పార్టీ లోగోతో సహా సోషల్ మీడియాలో జోరుగా వైరల్ చేశారు హస్తం లీడర్లు. ఎన్నికలకు ముందు నియోజకవర్గంలో జరిగే ఇసుక అక్రమ రవాణాకు అప్పుడున్న ఎమ్మెల్యే బాల్కసుమనే కారణమంటూ.. ఇప్పుడు ఎమ్మెల్యేగా గెలిచిన గడ్డం వివేక్ తప్పుడు ప్రచారం చేశారు. మరి అప్పుడున్న ఎమ్మెల్యే ఇసుక దందా చేస్తే.. ఇప్పుడు జరుగుతున్న అక్రమ రవాణా వెనుక ఎమ్మెల్యే వివేక్ ఉన్నట్లేనా.. అనే చర్చ ప్రస్తుతం చెన్నూర్ నియోజకవర్గంలో జోరుగా సాగుతున్నది. ఎలాంటి దందాలు చేయనివ్వనని చెప్పిన ఎమ్మెల్యే సారు.. మరి ఇప్పుడు వేలాల కేంద్రంగా జరుగుతున్న అక్రమ ఇసుక దందాపై ఏమని సమాధానం చెబుతారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

ఇరిగేషన్ అవసరాలకే ఇసుక తీయాలి..

చెన్నూర్ నియోజకవర్గంలోని జైపూర్ మండలం వేలాల, కిష్టాపూర్ శివారులోని క్వారీ ఇరిగేషన్ క్వారీ. కేవలం ఇరిగేషన్ అవసరాలకు మాత్రమే ఇక్కడి నుంచి ఇసుక తవ్వాలి. పైగా ఇసుక తరలించే వాహనాలపై ఇరిగేషన్ అనే ఫ్లెక్సీ ప్రదర్శించాలి. కానీ ప్రస్తుతం మైనింగ్ అధికారులు పర్మిషన్ ఇచ్చిన చోట కాకుండా ఇరిగేషన్ పేరు చెప్పి వేరే ప్రాంతాల్లో ఇసుక తీసి ప్రైవేటుగా విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. మైనింగ్ నిబంధనల ప్రకారం ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే ఇసుక క్వారీ నడపాలి. కానీ అర్ధరాత్రుళ్లు, తెల్లవారుజామున సైతం లారీలు రోడ్ల పైకి వస్తున్నాయి. రాత్రీ.. పగలు అనే తేడా లేకుండా 24 గంటల పాటు ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయని, అవి కూడా జీరోగా కొడుతున్నారంటూ స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ ఖజానాకు కోట్లాది రూపాయాల నష్టం జరుగుతున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం వెనుక ఎమ్మెల్యే హస్తం ఉందనే విమర్శలు సైతం వ్యక్తవుతున్నాయి. పర్మిషన్ ఉందని చెప్పుకుంటూ.. అనుమతి తీసుకున్న దగ్గర కాకుండా మరో చోట ఇసుక తీస్తున్నారని, వే బిల్లులు లేకుండా జీరో కొడుతున్నారని స్థానిక నాయకులు సైతం ఆరోపిస్తున్నారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణిలో వేలాల మాజీ ఎంపీటీసీ జాడి యేసయ్య కలెక్టర్ కుమార్ దీపక్‌ను కలిసి ఫిర్యాదు చేయడం చర్చనీయాంశమవుతున్నది.

ఎమ్మెల్యే వేలాలకు వచ్చి చూడాలి

ఇందారం గోదావరిలో ట్రాక్టర్లతో ఇసుక అక్రమ రవాణా చేసినప్పుడు.. దాని వెనుక నేను లేనని.. నియోజకవర్గంలో ఎలాంటి ఇసుక దందా చేయొద్దని ఎమ్మెల్యే వివేక్ చెప్పారు. మరి ఇప్పుడు ఇంత దర్జాగా ఇసుక అక్రమ రవాణా జరుగుతుంటే ఆయన ఎందుకు స్పందించడం లేదు. దందా సాగుతున్న తీరును ఎమ్మెల్యే వేలాలకు వచ్చి చూడాలి. ఎమ్మెల్యే ప్రమేయం లేకపోతే అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో సమాధానం చెప్పాలి. ఇసుక అక్రమ రవాణాతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతున్న విషయాన్ని అధికారులు గుర్తించాలి. లేనిపక్షంలో రాష్ట్రస్థాయిలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తాం. ***- జాడి యేసయ్య, మాజీ ఎంపీటీసీ వేలాల***